

మల్లన్నకు పట్నం భక్తుల పబ్బతి

హోరెత్తిన పట్నంవారం

- భక్తజనసంద్రంగా ఆలయ పరిసరాలు
- బోనాలు, పట్నాలతో దండిగా భక్తుల మొక్కులు
- దేవదేవుల నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



చేర్యాల, జనవరి 21: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామికి పట్నం భక్తులు పబ్బతి పట్టారు. మదినిండా మల్లన్న నామస్మరణతో పాటు డప్పు చప్పుళ్ల దరువుల నడుమ శివ శక్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల చిందులతో కొముర వెల్లి విజయాచల గుట్టలు హోరెత్తాయి. మల్లన్న బ్రహ్మోత్స వాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చిన మొదటివారాన్ని పురస్కరిం చుకుని ఆదివారం పట్నంవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకు న్నారు. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన సుమారు లక్షమంది భక్తులు తరలిరావడంతో కొమురవెల్లి జనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం దండిగా మొక్కులు తీర్చుకు న్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారుచేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంతంలో, ముఖమండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యం పోశారు. తమ కోర్కెలు నెరవేర్చమని గంగిరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మకు బోనాలు

స్వామివారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు.



బోనాల ఊరేగింపులో శివసత్తులు

డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతు ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కారు. అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చు కున్నారు. బెల్లంపానకం, కల్లును నైవేద్యంగా సమర్పించారు.

క్యూలైన్లలో పడిగాపులు

భారీగా భక్తులు హాజరవడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్నాల మందిరంలోని క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదిత రులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందో బస్తు చర్యలు తీసుకున్నారు.

నేడు పెద్దపట్నం, అగ్నిగుండాలు

ఆలయ తోటబావి ప్రాంగణంలో నేడు హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటను న్నారు. వంటినిండా పసుపు ధరించి భక్తులు పట్నంతోక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.



మల్లన్నకు హారతినిస్తున్న అర్చకుడు



గౌరాయపల్లి దారిలో నిలిచిన వాహనాలు



ఎల్లమ్మతల్లికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు



మల్లన్న ఆలయ ఆవరణలో భక్తజనసందోహం



ఎల్లమ్మతల్లికి పట్నంవేసి కల్యాణం చేస్తున్న భక్తులు



బోనాలు పూదిస్తున్న భక్తులు

భక్తులకు తప్పని తిప్పలు

- బిందెకు రూ.20, డబ్బాకు రూ.50 చొప్పున నీళ్లు కొనుగోలు
- రూ.40కు కొబ్బరికాయల విక్రయం
- విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు
- కానరాని పారిశుధ్య చర్యలు

7 లో..

పత్తి కొనుగోళ్లలో దళారుల చేతివాటం

- తక్షణ చెల్లింపుల ఆశజూపి దోపిడీ
- సీసీఐ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- జిన్నింగ్ మిల్లుల ద్వారా సంగారెడ్డి జిల్లాలో 75,175 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు
- రూ.159.77 కోట్ల బకాయిలు

సంగారెడ్డి టౌన్, జనవరి 21: పత్తి రైతులను దళారులు దోచుకుంటున్నారు. జిన్నింగ్‌మిల్లుల యాజమాన్యాలతో కుమ్మక్కై రైతులను బురిడి కొట్టిస్తున్నారు. తక్షణమే చెల్లిం పులు అంటూ ఆశజూపి తక్కువ ధరకే పత్తిని కొంటూ జేబులు నింపుకుంటున్నారు. మిల్లుల్లో చెల్లింపులు ఆలస్యమవు తుండడంతో డబ్బులు అవసరమైన రైతులు విధిలేక దళారు లకు పత్తిని అమ్ముకుంటున్నారు.

24,105 మంది రైతుల నుంచి పత్తి కొనుగోలు

సంగారెడ్డి జిల్లాలో జిన్నింగ్ మిల్లుల్లో ఇప్పటివరకు 24,105 మంది రైతుల నుంచి మొత్తం 75,175 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. జిల్లాలో మొత్తం 22 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేస్తున్నారు. నారాయణఖేడ్ పరిధిలో ఎనిమిది, జోగిపేట పరిధిలో నాలుగు, సదాశివపే టలో మూడు, రాయికోడ్ పరిధిలో ఐదు, వట్‌పల్లి ప్రాంతంలో రెండు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణ జరుగుతున్నది. నారా యణఖేడ్ పరిధిలో 4,792 మంది రైతుల నుంచి 17,269.39 మెట్రిక్ టన్నులు, జోగిపేట ప్రాంతంలో 6,242 మంది రైతుల నుంచి 12,684.82 మెట్రిక్ టన్నులు, సదాశివపేట ప్రాంతంలో 5,249 మంది రైతుల నుంచి 16,009.07 మెట్రిక్ టన్నులు, రాయికోడ్ పరిధిలో 6,561 మంది రైతుల నుంచి 24,526.78 మెట్రిక్ టన్నులు, వట్‌పల్లి ప్రాంతంలోని మిల్లుల్లో 1,262 మంది రైతుల నుంచి 4,685 మెట్రిక్ టన్నుల పత్తిని కొను గోలు చేశారు.



రైతుల ఖాతాల్లో రూ.363.69 కోట్లు జమ

జిల్లాలో ఇప్పటివరకు రూ.520.66 కోట్ల విలువ చేసే 75,175 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. ఇప్పటివ రకు 16,653 మంది రైతుల ఖాతాల్లో రూ.363.69 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. 7,452 మంది రైతులకు రూ.156.97 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. పత్తిని కొనుగోలు చేసిన 72 గంటల్లోగా చెల్లింపులు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తు న్నప్పటికీ 15 రోజులు దాటినా డబ్బులు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెల్లింపుల్లో జాప్యం.. దళారులకు వరం

జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని విక్రయించిన రైతులకు రెండు వారాల వరకు బిల్లులు చెల్లించడం లేదు. సీసీఐ ద్వారా క్వింటాలుకు రూ.7,020 మద్దతుధర నిర్ణయించారు. కానీ తేమ శాతంలో తేడాలు చూపుతూ క్వింటాలుకు రూ.7,005 మాత్రమే రైతుల ఖాతాల్లో సర్కారు జమ చేస్తున్నది. దీన్ని ఆసరాగా చేసుకుని మిల్లుల వద్ద పాగా వేసిన దళారీలు తక్షణమే నగదు చెల్లిస్తామని ఆశజూపి రైతు లను బురిడీ కొట్టిస్తున్నారు. వెంటనే నగదు ఇస్తున్నామని చెప్పి తక్కువ ధరకే పత్తిని కొటున్నారు. దళారులు క్వింటాలుకు రూ.6 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. మిల్లర్లతో కుమ్మక్కై రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని క్వింటాలుకు రూ.7020కు సీసీఐకి విక్రయిస్తు న్నట్లు తెలిసింది. ఇందులో మిల్లర్లు, దళారీల మధ్య పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెరిగిన సాగు.. తగ్గిన దిగుబడి

జిల్లాలో గత సీజన్‌తో పోలిస్తే ఈసారి పత్తి సాగు పెరిగిన ప్పటికీ దిగుబడి గణనీయంగా తగ్గింది. 2022 వానాకాలం సీజన్‌లో 3,46,903 ఎకరాల్లో పత్తిని సాగు చేయగా, 50 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పత్తి దిగుబడి వచ్చింది. 2023 వానా కాలంలో 3,57,482 ఎకరాల్లో పత్తిని సాగు చేసినట్లు వ్యవసా యశాఖ అధికారులు పేర్కొన్నారు. కానీ దిగుబడి మాత్రం 45 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. వాతావరణం సహకరించకపోవడమే ఇందుకు కారణమని రైతులు పేర్కొం టున్నారు. గత సంవత్సరం క్వింటాలు పత్తికి రూ.8,300 మద్దతు ధరను నిర్ణయించగా, బహిరంగ మార్కెట్‌లో క్వింటా లుకు రూ.11,500 వరకు కొనుగోళ్లు జరిగాయి. ఈసారి సీసీఐ క్వింటాలు పత్తికి కేవలం రూ.7,020 మాత్రమే మద్దతు ధర చెల్లిస్తున్నది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు కేవలం రూ.6 వేల నుంచి రూ.6,500 మాత్రమే చెల్లించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

- ఆదాయం, ఖర్చు వివరాల నివేదిక కోరిన కేంద్రం
- ఈ నెల 27లోపు సిద్ధం చేయాలని ఆదేశం
- గ్రామసభల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు
- మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు

మెదక్ అర్బన్, జనవరి 21: జాతీయస్థాయి ప్రజా ప్రణాళిక కార్యక్రమం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభి వృద్ధి ప్రణాళికలు రూపొందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. వాటితోపాటు ఇంకా ఏ మార్గాల ద్వారా ఆదాయం వస్తున్నది? వచ్చిన ఆదాయాన్ని ఎలా ఖర్చు చేస్తారు? అనే వివరాలతో పాటు 9 అంశాల్లో ప్రణాళికలు సిద్ధం చేసి పంపించాలని కేంద్రం నిబంధన విధించింది. దీంతో ప్రతీ పల్లెలో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామ సభలో ఆమోదించా లని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలిచ్చారు.

ప్రత్యేకంగా తొమ్మిది అంశాలు

గ్రామాభివృద్ధి ప్రణాళిలో కేంద్ర ప్రభుత్వం 9 అంశాలను ప్రవేశపెట్టింది. 'పేదరికం లేకుండా మెరుగైన జీవనోపాధి, పచ్చదనం-పరిశుభ్రత, పంచాయతీలకు సరిపడా నీరు, స్వయం సమృద్ధి, సామాజిక భద్రత, అందరూ ఆరోగ్యంగాగా ఉండేందుకు, బాలల మధ్య స్నేహపూర్వక కార్యక్రమాలు, మహిళా సాధికారత, పంచాయతీలో సుపరిపాలన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు రూపొందించారు. ఇందులో పంచాయతీలకు అవసరమైన ఏవైనా రెండు అంశాలు తీసుకొని ప్రత్యేకంగా బడ్జెట్ రూపొందించుకోవాలి.

ఈ నెల 27లోపు గ్రామసభలు

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘంతో పాటు రాష్ట్ర సర్కార్ నిధులతో గ్రామాల్లో పలు రకాల అభివృద్ధి పనులు



చేపట్టనున్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరం ఉంటుంది. గ్రామాల్లో ఎలాంటి పనులు కావాలి? వాటికి నిధుల అంచనాలను రూపొందించాలి. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీకి పంచాతీయ కార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించున్నారు.

మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తారు. మండలస్థాయిలో పూర్తయిన తర్వాత జిల్లాస్థా యిలో ఇదే తరహాలో ప్రణాళికలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలి. ఈ నెల 27 నాటికి గ్రామసభలు పూర్తిచేయాలి. ఈ నెల 31 నాటికి 'ఈ-గ్రామ స్వరాజ్' పోర్ట ల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

పక్కాగా ప్రణాళికలు

గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలి. ఇందుకు ప్రత్యేకంగా సభలు నిర్వహించి ప్రజల ఆమోదం తీసుకోవాలి. ముందుగా ప్రాధాన్య పనులు ఎంచుకోవాలి. ప్రణాళిక తయారీలో నిర్లక్ష్యం చేయవద్దు. ఈ నెల 27 లోపు పూర్తిచేసి, ఈ నెల 31 లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

-సాయిబాబా జిల్లా పంచాయతీ అధికారి, మెదక్

ఓటు నమోదుకు 3,983 దరఖాస్తులు

- ఓటరు జాబితాకు సవరణలు, తొలగింపుల్లో నిబంధనలు పాటించాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 21: లోక్‌సభ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్న నేథ్యంలో ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం రెండ్రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం పోలింగ్ కేంద్రాలవారీగా బీఎల్వోలు కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులపై దరఖా స్తులు స్వీకరించారు. మెదక్ మండల పరిధిలోని మక్త భూపతిపూర్‌లో 123, 124 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి యువత ఆసక్తి చూపించారని పేర్కొన్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలో 579 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కోసం 3,983 దర ఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఓటరు నమోదు, ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులో ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని బీఎల్వోలను ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబి తాపై వచ్చిన అభ్యంతరాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయనవెంట ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

సంగారెడ్డి రూరల్, జనవరి 21 : సంగారెడ్డిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు శిబిరాన్ని ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంగారెడ్డి తహసీల్దార్ ఫహీమ్ షేక్ ఉన్నారు.



ఓటరు నమోదు శిబిరాన్ని పరిశీలించి బీఎల్‌వోకు సూచనలు ఇస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా



సంగారెడ్డిలో ఓటరు నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

వాడవాడలా ఆధ్యాత్మికశోభ

- నేడు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ
- గ్రామగ్రామాన ఆలయాలు ముస్తాబు.. ఇంటింటా పండుగ వాతావరణం

మెదక్ అర్బన్, జనవరి 21: శ్రీరాముడు జన్మించిన అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఊరూవాడా శ్రీరామ తారకమంత్రం మర్మోగుతున్నది. నేటి ఉత్సవాలకు మెదక్ జిల్లాలోని ఆలయాలను శుద్ధిచేసి అలం కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని భక్తులు తమ ఇళ్లపై అంజనేయస్వామి, సీతారామచంద్ర స్వామి ఉన్న జెండాలను ఎగురవేశారు. వాహనాలకు సైతం జెండాలను అమర్చుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఇప్పటికే ఆలయాల పరి శుభ్రత కార్యక్రమాలు నిర్వహించగా.. అయోధ్యలో జరిగే కార్యక్రమాల వివరాలు... ప్రత్యేకతలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం మాధవానంద సరస్వతిస్వామి ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ తెలిపారు. రోజంతా నిరంతరా యంగా రామనామ సంకీర్తన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శోభాయాత్రలు.. ర్యాలీలు

అయోధ్యలో సోమవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగ నుండగా.. అదే రోజు భక్తులు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహ ణకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. శోభయాత్రలు, భజనలు ప్రదర్శనలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని వెంక ట్రావునగర్ కౌన్సిలర్ సమియొద్దీన్ ఇంటింటికి జెండాలు పంపిణీ చేశారు. అయోధ్యలో జరిగే మహత్తర కార్యక్ర మాన్ని వీక్షించే భక్తుల కోసం ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేస్తు న్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి అర్బన్, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో ఆల యాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఆలయాలను పూలమాలలు, కాషాయ ధ్వజాలతో అలంకరించారు. పట్టణ శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు వైకుంఠపురం నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు కార్ల ర్యాలీ నిర్వహించనున్నారు. సంగారెడ్డి సంజీవనగర్‌లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కల్వకుంట అశ్వంత్, వీహెచ్‌పీ నాయకుడు ద్వారకా రవి ఇంటింటికి శ్రీరాముడి చిత్రపటాలు పంపిణీ చేశారు.



జెండాలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సమియొద్దీన్



సంగారెడ్డి శ్రీవైకుంఠపురంలో ఊరేగింపు కోసం హనుమాన్ విగ్రహాన్ని సిద్ధం చేస్తున్న భక్తుడు



వేడుకలకు ముస్తాబైన మెదక్ రామాలయం

చిప్పల్‌తుర్తి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

నర్సాపూర్, జనవరి 21: నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని ఆశ్రమంలో ఆదివారం మహారాష్ట్రకు చెందిన ప్రముఖ గురువు శ్రీకృష్ణ నందాజి మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

శివ్వంపేట, జనవరి 21: విద్యుదాఘాతంతో కూలీ మృతిచెందాడు. మండల పరిధిలోని చండికి చెందిన మల్లేశ్(46) గ్రామానికి సమీపంలోని మల్యతండా వద్ద విత్తన పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం కూలీకి వెళ్లిన మల్లేష్ పరిశ్రమలోని బోర్లు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతు చేసేందుకు యత్నించాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

● లంబాడ హక్కుల పోరాట సమితి



మాట్లాడుతున్న లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు

నారాయణఖేడ్, జనవరి 21: అవినీతిని ప్రశ్నించినందుకు లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్‌పై తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్ అన్నారు. నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాది కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అవినీతి అక్రమాలపై రాజేష్‌నాయక్ ప్రశ్నించడంతో అతనిపై కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇన్‌చార్జిగా కొనసాగుతూ అనేకరకాలుగా అవినీతికి పాల్పడుతున్నారని, అందువల్ల అక్రమాలపై బహిరంగ చర్చకు వచ్చి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల ఆరోగ్యాలు, హక్కులను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో సీఎంను కలిసి అక్రమాలపై వివరించనున్నట్లు ప్రకాష్‌రాథోడ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, నాయకులు మోహన్‌రాజు, వినోద్, రవి, పాల్గొన్నారు.

లేగ దూడపై అడవి జంతువు దాడి



మృత్యువాతపడిన ఆవు దూడను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కౌడిపల్లి, జనవరి 21: లేగదూడపై అడవి జంతువు దాడిచేసి చంపిన ఘటన మండల పరిధిలోని సలవత్‌పూర్‌లో శనివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి శ్రీశైలం తన వ్యవసాయ పొలం వద్ద ఐదు ఆవులను కట్టేశాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకెళ్లి చూడగా.. లేగదూడపై అడవి జంతు దాడిచేసి చంపితిన్న ఆనవాళ్లు కనిపించాయి. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేగా.. అటవీశాఖ అధికారి కరీముల్లా, పశువైద్యాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ పరిసర ప్రాంతం రైతులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కాగా విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఘటనా స్థలం వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు.


వ్యవసాయ బావుల నుంచి నీటిని కొని తెచ్చుకుంటున్న భక్తులు


వెనకదారి ఆవరణలో ప్లేట్లను పారేసి చేతులు శుభ్రం చేసుకుంటున్న భక్తులు


పట్నం వారంలో భక్తుల నుంచి డబ్బు తీసుకుంటున్న ఒగ్గు పూజారి

మల్లన్న భక్తులకు తప్పని తిప్పలు

● కానరాని పారిశుధ్య చర్యలు ● రూ.40కు కొబ్బరికాయల విక్రయం ● విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు


వ్యర్థాల పారబోతతో రంగుమారిన కోనేరు నీటిలో స్నానం చేస్తున్న భక్తులు

చేర్యాల, జనవరి 21: కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి కల్పిస్తామని, పారిశుధ్య చర్యలను ఎప్పటికప్పుడు ముమ్మరం చేస్తూ స్వచ్ఛతగా తీర్చిదిద్దుతామని సమీక్షా సమావేశాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పగా ప్రకటనలు చేసినా పట్నంవారం నిర్వహణలో విఫలమయ్యారు.

బిందెడు నీళ్లకు రూ.20, డబ్బాకు రూ.50

వాహనాలను దూరంలోనే నిలిపివేసే సి పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుచేసిన క్రమంలో నీటి వసతికి చర్యలు తీసుకోలేదు. దీంతో భక్తులు దుకాణాలకు, వ్యవసాయ బావులవద్దకు వెళ్లి బిందెడు నీళ్లకు రూ.20, డబ్బాకు రూ.50 చొప్పున కొనుగోలు చేశారు. అలాగే స్నానానికి రూ.20 చొప్పున ఖర్చుచేశామని వాపోయారు.

పనిచేయని మిషన్ భగీరథ నల్లాలు

తాగునీటి కోసం ఆలయ తోటబావి ప్రాంగణంలోని మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేశామని ప్రకటించినా నల్లాలు పనిచేయలేదు. వృథాగా ఉండటంతో భక్తులు వాటిపై దుస్తులు ఆరబెట్టుకున్నారు.

క్యూలైన్లలో తాగునీరు లేక తంటాలు

భక్తుల రద్దీ దృష్ట్యా ధర్మ దర్శనానికి సుమారు 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటలపాటు సమయం పట్టింది. కిక్కిరిసిన క్యూలైన్లలో పడిగాపులు కాయడంతో తాగునీటి కోసం తల్లడిల్లారు. ఆరుబయట క్యూలైన్ల ప్రాంగణంలో నీటివసతి కల్పించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

పారిశుధ్య చర్యలు శూన్యం

స్వామివారి దర్శనానంతరం బయటకు వచ్చే ఆవరణలో పలువురు అన్నదానం నిర్వహించి భక్తుల ఆకలి తీర్చినా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయకపోవడంతో నడకదారిలోనే ప్లేట్లను ఇష్టానుసారం పారబోశారు. అంతేకాకుండా అక్కడే చేతులు శుభ్రం చేసుకోవడంతో చిత్తడిగా మారినా ఆలయవర్గాలెవరూ పట్టించుకోలేదు. పునరుద్ధరణ కమిటీ సభ్యులూ పర్యవేక్షించలేదు. ప్రసాద విక్రయశాల ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎల్లమ్మగుట్టపై కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో వృథానీటిని మళ్లింపచేయకపోవడంతో భక్తులు నడిచేదారిలో ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం

ఆలయ పరిధిలో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఎల్లమ్మ దేవతను చీకట్లోనే దర్శనం చేసుకున్నారు. ఉదయం 7 నుంచి తరచూ అంతరాయం ఏర్పడింది. బోర్లు కూడా సక్రమంగా పనిచేయక వసతి గదుల్లో నీళ్ల కోసం నానా తంటాలు పడ్డారు. తోటబావి జనరేటర్ మొరాయించిది.

ఎల్లమ్మ స్వాగతతోరణం వద్ద గజిబిజి

తాత్కాలిక క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో భక్తులు ఎల్లమ్మ ఆలయ స్వాగతతోరణం దాటి ఎండలోనే నిల్చున్నారు. ఎల్లమ్మతల్లికి బోనాలు, ఒడిబియ్యం తీసుకెళ్లేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో క్యూలో నిల్చున్న భక్తుల మధ్యలోంచి వెళ్లడంతో తోపులాట జరిగింది. పోలీసులు కలుగజేసుకుని భక్తులను ఆపి ఎల్లమ్మగుట్టపైకి అనుమతించారు. ఇదిలా ఉండగా రూ.20కు విక్రయించాల్సిన కొబ్బరికాయలను కాంట్రాక్టర్ సంబంధీకులు రూ.40కు విక్రయించారు. అయినా ఆలయాధికారులు చోద్యం వహిస్తుండటంతో భక్తుల జేబులకు చిల్లులుపడ్డాయి.


ప్రసాద విక్రయశాల ఆవరణలో చెత్తాచెదారం


ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయల వృథా నీటితో చిత్తడిగా మారిన మెట్లు

నేటి నుంచి కొండపోచమ్మ జాతర

● మూడునెలల ఉత్సవాలకు ఆలయం ముస్తాబు
● భారీగా తరలిరానున్న భక్తులు
● ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



కొండపోచమ్మ ఆలయం, కొండపోచమ్మ అమ్మవారు

జగదేవ్‌పూర్, జనవరి 21: ప్రజల కోరికలు తీర్చే కల్పవల్లి కొండపోచమ్మ ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. మూడునెలల పాటు అంగరంగ వైభవంగా జాతర కొనసాగుతుంది. తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచిన కొండపోచమ్మ ఆలయం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామానికి ఉత్తర దిశలో ఉన్నది. కొండపోచమ్మ జాతర ఉత్సవాలు 22న ప్రారంభమై ఉగాది వరకూ జరుగుతాయి. ఈ జాతరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు ఉమ్మడి వరంగల్, మెదక్, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తుల వేల సంఖ్యలో తరలివస్తారు.

ఆకట్టుకునే లష్కర్ బోనాలు

జాతరకు వచ్చే భక్తులు ఆలయం వద్ద ఉన్న చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. కొత్త కుండలను తీసుకొచ్చి అమ్మవారి బోనాన్ని పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి ఆటపాటలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాలతో తీసుకొస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ భక్తులు తెచ్చే బోనాలు (లష్కర్) ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయం వద్ద అన్ని వసతులు కల్పించామని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సర్పంచ్ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, జనగామ, బస్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆలయం వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

ఉద్యోగం పేరిట నిరుద్యోగ యువకులకు టోకరా

● రూ.1.40 లక్షలు స్వాహా

శివ్వంపేట, జనవరి 21: ఉద్యోగం పేరిట నిరుద్యోగ యువకుల నుంచి ఆన్‌లైన్‌లో రూ.1.40 లక్షలను స్వాహా చేశాడు. శివ్వంపేట మండలం పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కార్తీక్, దొంతి గ్రామానికి చెందిన జైపాల్ తూప్రాన్‌లో ఐటీఐ చదువుతున్నారు. ఇదే కాలేజీలో చదువుతున్న రామాయంపేట మండలం కాట్రియాల్ తండాకు చెందిన రంజిత్ తోటి విద్యార్థులైన కార్తీక్, జైపాల్‌కు నెలకు రూ.లక్ష వేతనంతో పంజాబ్ రాష్ట్రంలోని అవిన్మో సంస్థలో మార్కెటింగ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఉద్యోగం కోసం రూ.70 వేలు ఖర్చు వస్తుందని గతేడాది మార్చిలో కార్తీక్, జైపాల్ నుంచి రూ.1.40 లక్షలు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయించుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు రంజిత్‌ను నిలదీశారు. మీరు మరికొందరిని చేర్పిస్తే మీ డబ్బులు మీకు వస్తాయని చెప్పాడు. బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాతకక్షలతో యువకుడి హత్య


రవి(ఫైల్)

రాయికోడ్, జనవరి 21: పాతకక్షల నేపథ్యంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామానికి చెందిన కర్నల్ రవి(25) అదే గ్రామానికి చెందిన అలిగే రాజు మధ్య కొన్నిరోజులుగా పాత కక్షలతో గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్ వద్ద ఆటోలో రవి కూర్చున్నాడు. గమనించిన రాజు తన ఇంటికి వెళ్లి వేట కొడవలి తీసుకొచ్చి రవిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. రవిని వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేష్ తెలిపారు. కాగా నిందితుడు రాజును ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూలో ప్రణతికి సిల్వర్ మెడల్


సిల్వర్ మెడల్ చూపుతున్న ప్రణతి

సంగారెడ్డి అర్బన్, జనవరి 21: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా ఉమెన్ కిక్ బాక్సింగ్, కుంగ్‌ఫూ పోటీల్లో సంగారెడ్డికి చెందిన సీహెచ్.ప్రణతి జాతీయ స్థాయిలో తలపడి రెండో స్థానం దక్కించుకుని సిల్వర్ మెడల్ సాధించింది. పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ప్రణతి రెండు క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచింది. ప్రణతి సిల్వర్ మెడల్ సొంతం చేసుకోవడం పట్ల మాస్టర్ పోచయ్య, తల్లిదండ్రులు నాగరాజు, రాణి, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

నిబంధనల ప్రకారం అమ్మకాలు చేపట్టాలి


జహీరాబాద్ పట్టణంలోని ఓ మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

జహీరాబాద్, జనవరి 21: మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రజిత పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణాల తనిఖీల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులు రికార్డుల నిర్వహణ, కొనుగోళ్లు, అమ్మకాలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని తెలిపారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల నిర్వహణ విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిని తొలగించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆయా దుకాణాలకు మద్యం ఎక్కడి నుంచి వచ్చిందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ అనిల్, సిబ్బంది అనిల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ధ్వంసం


దుండగులు ధ్వంసం చేసిన హుండీ తాళం

తూప్రాన్, జనవరి 21: ఆలయ హుండీ తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నించారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద హుండీ ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి గుర్తుతెయని దొంగలు చొరబడి హుండీ తాళం పగులగొట్టారు. మూడురోజుల క్రితమే హుండీ లెక్కింపు చేపట్టడంతో నష్టం జరగలేదు. ఇదిలా ఉండగా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మూడురోజులపాటు జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి హుండీలో భారీఎత్తున నగదు ఉండవచ్చన్న ఉద్దేశంతో చోరీకి ప్రయత్నించి ఉండవచ్చని చెబుతున్నారు.

ప్రభుత్వ గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి విద్య

● ఫిబ్రవరి 11న గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష
● 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
● సిద్దిపేట జిల్లాలో మొత్తం 2,560 సీట్లు



సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గురుకుల పాఠశాల

సిద్దిపేటరూరల్, జనవరి 21: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల ద్వారా కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నది. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు అడ్మిషన్ పొందేందుకు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

సిద్దిపేట జిల్లాలో మొత్తం 32 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 16, గిరిజన సంక్షేమ గురుకులాలు 2, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు 8, తెలంగాణ గురుకుల పాఠశాల 1 (జనరల్ పాఠశాలలు), మైనార్టీ గురుకుల పాఠశాలలు 5 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తారు. ఐఐటీ జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, సెంట్రల్ యూనివర్సిటీలు, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీతో పాటు ప్రముఖ యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్, హౌస్ పేరెంట్ వ్యవస్థ ఉంటుంది. పాఠ్యాంశాలతోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్, యోగా, క్రీడలు, కోడింగ్, ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది.

విద్యార్థులకు అందించే సౌకర్యాలు

ప్రతిరోజూ పోషకాహారం అందిస్తారు. ప్లేట్, గ్లాస్, బెడ్ షీట్, బ్లాంకెట్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ రికార్డు బుక్స్, అవసరమైన స్టేషనరీ ఉచితంగా ఇస్తారు. ప్రతి విద్యార్థికీ స్కూల్ యూనిఫాం మూడు జతలు ఇస్తారు. వీటితోపాటు పీటీ డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూస్, సాక్స్, నైట్ డ్రెస్, ట్రంక్ బాక్సు కూడా ఇస్తారు. సబ్బులు, షాంపూల కొనుగోలుకు ప్రతి నెల నగదు ఇస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, బీసీ విద్యార్థులు 9 నుంచి 11 మధ్య వయసు ఉండాలి. 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 9 నుంచి 13 మధ్య వయసు ఉండాలి. కుటుంబ సంవత్సర ఆదాయం రూరల్ విద్యార్థులకు రూ.1.50 లక్షలు, అర్బన్ లేదా పట్టణ ప్రాంతం విద్యార్థులకు రూ.2 లక్షలకు మించకూడదు.

పరీక్ష విధానం

ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలను మూడు, నాలుగు తరగతుల పాఠ్యాంశాల నుంచి ఇస్తారు. తెలుగు, పరిసరాల పరిజ్ఞానంలో 20, ఇంగ్లీష్, మ్యాథ్స్‌లలో 25, మెంటల్ ఎబిలిటీలో 10 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో గుర్తించాలి. ప్రశ్నాపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఇస్తారు. పరీక్ష రాసేందుకు 2 గంటల సమయం మాత్రమే ఉంటుంది. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగానే అడ్మిషన్ ఇస్తారు. రిజర్వేషన్ నిబంధనలు, స్థానికత, ప్రత్యేక కేటగిరీలను పరిగణనలోకి తీసుకుంటారు. విద్యార్థుల ఎంపికలో పాత జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. రూ.100 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 23 దరఖాస్తుకు చివరి తేదీ కాగా.. ఫిబ్రవరి 11న పరీక్ష ఉంటుంది. పదిరోజుల ముందు నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

పరీక్ష రాయకుంటే అడ్మిషన్ లభించదు

ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకుని తప్పక పరీక్ష రాయాలి. పరీక్ష రాయకుండా గురుకుల పాఠశాలలో అడ్మిషన్ లభించదు. గురుకుల పాఠశాలలో చదివిన పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వం పిల్లలకు విద్యాపరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నది. కార్పొరేట్ స్థాయి విద్య కేవలం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో మాత్రమే లభిస్తున్నది. ఈ అవకాశం జిల్లాలోని విద్యార్థులు వినియోగించుకోవాలి.

- కే.నిర్మల, రిజినల్ కో ఆర్డినేటర్, సిద్దిపేట జిల్లా

ఓటరు నమోదు ప్రక్రియను సజావుగా చేపట్టాలి

● జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి

జహీరాబాద్, జనవరి 21: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను సజావుగా చేపట్టాలని జహీరాబాద్ ఆర్డీవో వెంకారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జహీరాబాద్ పట్టణంలో పోలింగ్‌బూత్‌ల వద్ద కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులు ఎలాచేపడుతున్నారని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే ఓటర్లకు ఇబ్బందులు ఏర్పడుతాయనే విషయాన్ని బీఎల్‌వోలు గమనించాలన్నారు. అన్ని వివరాలను పూర్తిగా తెలుసుకున్నాకే వివిధ రకాల ఫారాలను పూరించాలని సూచించారు. సందేహాలుంటే సంబంధిత అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐ రుక్మోద్దీన్ ఉన్నారు.



చిన్నశంకరంపేటలో ఓటరు నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ ఆర్డీవో అంబదాసు రాజేశ్వర్



నారాయణఖేడ్‌లో ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చిన్నశంకరంపేట: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించుకోవాలని మెదక్ ఆర్డీవో అంబదాసు రాజేశ్వర్ సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పుల గురించి వివరించారు. అనంతరం బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు కల్పించారు. ఆయనవెంట తహసీల్దార్ మన్నన్, ఈవో సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఓటర్ల నమోదుపై స్పెషల్ డ్రైవ్

నారాయణఖేడ్: రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు నూతన ఓటర్ల నమోదు కోసం ఆదివారం నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రెండు చోట్ల పేర్లు ఉన్న వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించారు. నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌ను ఆర్‌ఐ శ్యాంరావు పర్యవేక్షించారు.



జహీరాబాద్ పట్టణంలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకారెడ్డి

క్రీడలతో స్నేహం, క్రమశిక్షణ: ఎమ్మెల్యే



క్రికెట్ టోర్నమెంటు ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 21: క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్ జూనియర్ కాలేజీ మైదానంలో సుల్తాన క్రికెట్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడా పోటీలతో యువతలో దాగి ఉన్న నైపుణ్యం బయటపడటంతో పాటు మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి దోహదపడుతాయన్నారు. క్రమశిక్షణ, స్నేహం కూడా అలవరుతుందని తద్వారా ప్రేమ ఆప్యాయతలు పెరుగుతాయని చెప్పారు. క్రీడాపోటీలు నిర్వహించిన వారిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీముద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, నాయకులు శేఖర్, సత్యంగౌడ్, భిక్షపతి, బాల్‌రెడ్డి, మహ్మద్, లక్ష్మన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్



సంగారెడ్డిలో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ఐఎంఏ డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)మంజీర బ్రాంచ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్రికెట్ లీగ్ టోర్నమెంట్ సీజన్-4ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో సంగారెడ్డి పట్టణంతో పాటు సదాశివపేట డాక్టర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు టీఎస్ఎంసీ మెంబర్ డాక్టర్ ఆనంద్ తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్, యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లీగ్ మ్యాచ్‌లో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఉషాకిరణ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చక్రపాణి, డాక్టర్లు స్వామిగౌడ్, రాజుగౌడ్, పరమేశ్, నందకుమార్, ఆనంద్‌నాయక్, పరుశురాం, బాబుల్‌రెడ్డి, వెంకట్, హరికుమార్‌గౌడ్, సురేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

అల్లాదుర్గం, జనవరి 21: బైక్‌ను కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ వద్ద గల 161వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముస్లాపూర్ గిరిజన తండాకు చెందిన ముడావత్ విఠల్(30) బైక్‌పై ముస్లాపూర్ నుంచి తండాకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అల్లాదుర్గం వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొనడంతో విఠల్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డికి చెందిన ఇద్దరి అదృశ్యం

సంగారెడ్డి క్రైం, జనవరి 21: సంగారెడ్డి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన రాథోడ్ గంసిబాయ్(36) శనివారం కూలీపని కోసం అడ్డా మీదికి వెళ్తున్నాని చెప్పి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఆమె భర్త దశరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అలాగే సంగారెడ్డి పట్టణంలోని మార్క్స్‌నగర్ కాలనీకి చెందిన రాథోడ్ హిరామన్(30) శనివారం నుంచి కనిపించకుండా పోయాడు. శనివారం ఉదయం మేస్త్రీ పని కోసం ఇంటి నుంచి వెళ్లిన హిరామన్ తిరిగి రాలేదు. ఆదివారం ఆయన భార్య రాథోడ్ సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



గంసిబాయ్, హిరామన్

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి: ఎస్‌ఐ



జీడిపల్లిలో బ్లాక్ బెల్టులను ప్రదానం చేస్తున్న ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్, జనవరి 21: ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి అని ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో సన్‌షైన్ షోటోకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ శిక్షణ అభ్యర్థులకు బ్లాక్‌బెల్టులను ఎస్‌ఐ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఆరోగ్యానికి, ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 4 జిల్లాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు వివిధ రకాల బెల్టులు, సర్టిఫికెట్లను అందుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖామల్లేష్, కనిగిరి లింగం, శంకర్, మాస్టర్లు సురేష్, సాయికుమార్, రవీందర్, ఎల్లం, ప్రభాకర్, హరీష్, విశాల్, పృథ్వీ, రాజేష్, ఉదయ్ స్వామి పాల్గొన్నారు.

మాసాయిపేటలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

మాసాయిపేట, జనవరి 21: మండల కేంద్రమైన మాసాయిపేటలో హైదరాబాదుకు చెందిన సిసిస్రాఫ్ మెమోరియల్ ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ జబ్బులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధుసూధన్‌రెడ్డి, కార్యదర్శి బాలక్రిష్ణ, ఆస్పత్రి సిబ్బంది నాగరాజు, డాక్టర్లు రోమాన్ బేగం, మోష, ఫాతిమా, శోభ, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

నిజాంపేట, జనవరి 21: లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన ఘటనలో రేషన్ డీలర్‌పై కేసు నమోదయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఉన్న 11వ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రేషన్ దుకాణానికి మొత్తం 68.53 క్వింటాళ్ల బియ్యం సరఫరా కాగా లబ్ధిదారులకు 26.5 క్వింటాళ్లు పంపిణీ చేయగా 27.5 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉన్నట్లు తేలింది. లోటు ఉన్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని పక్కదారి పట్టించడంతో 11వ నంబర్ రేషన్ డీలర్ రజినిపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. రేషన్ దుకాణ నిర్వహణను గ్రామంలోని మరో డీలరుకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, జనవరి 21: నారాయణఖేడ్ పట్టణానికి చెందిన నాగన్నకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.42,500ల చెక్కును ఆదివారం నారాయణఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఖేడ్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, గొల్ల కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుయాదవ్ పాల్గొన్నారు.

శివకుమార్‌కు బాపు పురస్కారం

నారాయణఖేడ్, జనవరి 21: నారాయణఖేడ్ మండలం అనంత్‌సాగర్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ బాపు పురస్కారాన్ని అందుకోవడంతో పాటు జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. బాపు 90వ జయంతిని పురస్కరించుకొని శివకుమార్ రావి ఆకుపై ఆయన చిత్రాన్ని మలిచి నందుకు పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

11న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

సంగారెడ్డి రూరల్, జనవరి 21: ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లోని మోతినగర్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య వెస్ట్ జోన్ అధ్యక్షుడు టిడివి ప్రసాద్ తెలిపారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ విదేశాల్లో ఉన్న బ్రాహ్మణ బంధువుల కోసం ఈ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేశామన్నారు. వివాహ పరిచయ వేదికలో పాల్గొనే వారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9949160688 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం

సిద్దిపేట అర్బన్, జనవరి 21: కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక కర్షక మైత్రి జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ద్వారా పోరాట ప్రచారాన్ని నిర్వహించి జనవరి 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ వాహనాల ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పోరాటాలు త్యాగాల ద్వారా తెచ్చుకున్న 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వంపై కార్మికులు కర్షకులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ నిర్వహించనున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ అసమర్థతతో అసంపూర్తి పనులు

గజ్వేల్, జనవరి 21: బీఆర్ఎస్ నాయకుల చేతగానితనంతోనే గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గం సమయమంతా కుట్రలు, కుతంత్రాలకే సరిపోయిందని, జరగాల్సిన అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయన్నారు. పనులు నిలిచిపోయేలా చేసిన మాజీమంత్రి హరీశ్‌రావు గజ్వేల్ అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సిద్దిపేటతో పోలిస్తే గజ్వేల్‌పై మంత్రి హరీశ్‌రావుది సవతి తల్లి ప్రేమ అని ఆరోపించారు. గజ్వేల్‌లో అభివృద్ధి పనులు ఎన్నో నిలిచిపోయాయని, కోటమైసమ్మ రోడ్డు, యూజీడీ పనులు, సంగాపూర్ రింగ్ రోడ్డు లింక్ ఎక్కడివక్కడే ఉన్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న రింగ్‌రోడ్డును ప్రారంభించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా గజ్వేల్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు తగదు

హత్నూర, జనవరి 21: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించడం హాస్యాస్పదంగా ఉన్నదని టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీమ్ అన్నారు. హత్నూరలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి జీర్ణించుకోలేక ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శించడం తగదన్నారు. ప్రభుత్వంపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. 10 సంవత్సరాలుగా గుర్తుకురాని ప్రొటోకాల్ సమస్య ఇప్పుడు గుర్తుకువచ్చిందా అని ప్రశ్నించారు. ఇన్‌చార్జిల వ్యవస్థ తెచ్చి ప్రశాంత వాతావరణాన్ని కాంగ్రెస్ చెడగొడుతున్నదని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉన్నదని హకీమ్ అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మదన్‌రెడ్డి కూడా ఇన్‌చార్జిగా ఉన్న రోజులు మర్చిపోవద్దని గుర్తు చేశారు.

ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుల ఎన్నిక

చిన్నశంకరంపేట, జనవరి 21: ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, ఎండీ జబ్బర్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య తెలిపారు. వారికి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. తమకు సహకరించిన ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామని చెప్పారు.

ఆధార్ సెంటర్ లేక అవస్థలు

హవేళిఘణపూర్, జనవరి 21: మండల కేంద్రమైన హవేళిఘణపూర్‌లో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన ఆధార్‌కార్డు తీసుకోవాలన్నా, సవరణలు చేసుకోవాలన్నా మెదక్ పట్టణానికి వెళ్లాల్సి వస్తున్నది. దీనికోసం రోజుల తరబడి వ్యయప్రయాసలకోర్చి తిరగాల్సిందే. దీంతో సమయం వృథా అవుతుంది. జిల్లా అధికారులు, ఎమ్మెల్యే రోహిత్‌రావు, నాయకులు చొరవ తీసుకుని హవేళిఘణపూర్‌లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హవేళిఘణపూర్‌లో కోతుల బెడద

హవేళిఘణపూర్, జనవరి 21: హవేళిఘణపూర్‌లో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ, చిన్నారులను గాయపరుస్తున్నాయి. ఇంటిలో ఉన్న వస్తువులను సైతం ఎత్తు కెళ్తున్నాయి. సంక్రాంతి రోజున తమ ఇంటిని చుట్టుముట్టిన కోతులను వెళ్లగొడుతుండగా ఫనిరాజు అనే వ్యక్తిని గాయపరిచాయి. అతడి అన్న నాగరాజు ఇంట్లోకి పరుగెత్తుతూ కిందపడడంతో కాలు విరిగింది. కోతులను నివారించేందుకు నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు షురూ

శివ్వంపేట, జనవరి 21: మండలంలోని సికింద్లాపూర్ సమీపంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ఉత్సవాలను ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. మూడు నెలల పాటు ప్రతి ఆదివారం నిర్వహించే జాతరకు మండల ప్రజలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈవో శశిధర్‌గుప్తా, పూజారి ధనంజయశర్మ, సర్పంచ్ సుధాకర్ రెడ్డిరెడ్డి, నాయకులు మాదవరెడ్డి, హన్మంతరెడ్డి, మహేందర్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతీర్థ్ కార్యక్రమంలో పులిమామిడి రాజు

సంగారెడ్డి అర్బన్, జనవరి 21: ప్రధానమంత్రి మోదీ పిలుపుమేరకు స్వచ్ఛ్ తీర్థ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంతో పాటు రెవెన్యూ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయాలను బీజేపీ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపుమేరకు దేశ ప్రజలందరూ ఆలయాలను శుభ్రం చేశారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవిశంకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్, నాయకులు శ్రీనివాస్, రమేశ్, రాములు, అజయ్, మహేశ్, ప్రభాకర్, యువసేన నాయకులు అనిల్, హరీశ్ గుణాకర్, సోమశంకర్, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



అభయాంజనేయ స్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న పులిమామిడి రాజు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

జిన్నారం, జనవరి 21: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అండూరు, సోలక్‌పల్లి, ఊట్ల, జిన్నారం, మాదారం, గడ్డపోతారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో నిధులు ఖర్చు చేస్తున్నామని, గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల సహకారం అభినందనీయమన్నారు. గడ్డపోతారంలో రూ.2.70 కోట్ల హెటిరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచులు ఖదీర్, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, లావణ్య, సరిత, ప్రకాశంచారి, ఎంపీటీసీలు వెంకటేశంగౌడ్, గంగురమేష్, లాణ్య నరేష్, జానాబాయి తదితరులు పాల్గొన్నారు.



గడ్డపోతారంలో నూతన పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రావి ఆకులపై అయోధ్య రాముడి రూపాలు



రావి ఆకులపై రామాలయం, రాముడి చిత్రాలను వేసిన శివకుమార్

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, జనవరి 21: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంత్‌సాగర్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ అయోధ్య రాముడి రూపాలను, రావి, బాదం, మర్రి ఆకులపై చిత్రీకరించారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస్‌చారి ఆదివారం రావి ఆకుపై అయోధ్య బాల రాముడి రూపాన్ని రంగులతో తీర్చిదిద్దారు.



రావి ఆకుపై రాముడి చిత్రాన్ని గీసిన అవుసుల శ్రీనివాస్‌చారి

చాకుపీసుపై రాముడి చిత్రం

మనోహరాబాద్: మనోహరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న చిత్రలేఖన ఉపాధ్యాయుడు బ్రహ్మచారి చాక్‌పీస్‌పై రాముడి రూపాన్ని చెక్కారు.



చాకుపీసుపై రాముడి రూపం

రోడ్డు నియమాలపై ప్రజలకు అవగాహన

పెద్దశంకరంపేట, జనవరి 21: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పెద్దశంకరంపేట శివారులోని కె.వెంకటాపూర్ గ్రామస్థులకు ఆదివారం పెద్దశంకరంపేట ఎస్‌ఐ బాలరాజు, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు ఐఎంఎస్ మేనేజర్ ఖాజామైనుద్దీన్ రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని ఎస్‌ఐ బాలరాజు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కేఎస్‌ఆర్, ఎన్‌హెచ్‌ఏ సిబ్బంది కృష్ణయ్య, శివకుమార్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కె.వెంకటాపూర్ గ్రామస్థులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాలరాజు

శ్రీరామ స్వర సంహిత కీర్తనల ఆవిష్కరణ

చేగుంట, జనవరి 21: అయోధ్య రామయ్య అష్టోత్తర శతకీర్తనవాళి శ్రీరామ స్వర సంహిత కీర్తనలు ఆదివారం చేగుంట మండల కేంద్రంలోని శివ పంచాయిత హనుమాన్ ఆలయంలో ఆవిష్కరించారు. బ్లూ రాబిట్ ఎంటర్‌టైన్మెంట్ కో ఫౌండర్ నిరూపాపటేల్, గాయకుడు రవివర్మ పోటీదర్ పాల్గొని కీర్తనను ఆవిష్కరించారు. కీర్తనలకు సంబంధించిన ప్రతులను హనుమాన్ చరణాల ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్యలో బాలరాముడు ప్రతిష్ఠ సందర్భంగా కీర్తనలు రచించినట్లు తెలిపారు. అందరికీ రాముడి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కూన రాములు, గ్రామ నాయకులు పరంజ్యోతి, సురేష్, వెంకటి, కాసం శంకర్, నాగరాజు, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

అంత్వార్‌లో జుక్కల్ ఎమ్మెల్యే పర్యటన

నారాయణఖేడ్/మనూరు, జనవరి 21: కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆదివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని తమ అమ్మమ్మ గ్రామమైన అంత్వార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఖేడ్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు స్వాగతం పలికి, సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతరావు తన చిన్ననాటి జ్ఞాపకాలు, గ్రామంతో ఉన్న అనుబంధం, గ్రామస్థులతో ఉన్న పరిచయాలను నెమరువేసుకున్నారు. అనంతరం మనూరు మండలంలో ఉన్న ప్రసిద్ధిగాంచిన బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఆయన ఆయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఆయనవెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్ ఉన్నారు.

లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధమవ్వాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్
● సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ 100వ వర్ధంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 21: లెనిన్ స్ఫూర్తితో ప్రజలు ఉద్యమాలకు సిద్ధమవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం సంగారెడ్డిలోని కేకే భవన్‌లో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగిల్స్ ముందుకు తీసుకెళ్తే దాన్ని అమలు చేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. దేశంలో బీజేపీ ప్రజల మధ్య చిచ్చుపెడుతూ, ఓటు రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ లౌకిక విలువలను తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, జీ.సాయిలు, నాయకులు యాదగిరి, నర్సింహులు, అశోక్, కృష్ణ, రమేష్‌గౌడ్ రమేష్, దత్తు, పుండ్లిక్ తదితరులు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం రష్యన్ విప్లవ పోరాట యోధుడు కామ్రేడ్ లెనిన్ 100వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, నాయకులు నర్సింహులు, చిరంజీవి, సంగయ్య, శ్రీనివాస్, సంగయ్య, గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెనిన్ ప్రజాపోరాటాలను గుర్తు చేసుకున్నారు.



సంగారెడ్డి, నారాయణఖేడ్ పట్టణాల్లో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు